క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పట్టణంలోని ఎఫ్‌సీఐ, ప్రకాశనగర్, బాపూజీనగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు, వ్యాపారులు గమనించి సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి దేవాలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో నేటి నుంచి 17వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ఇప్పటికే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల7, 8, 9 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

హాలియా : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మారేపల్లి గ్రామంలో ఎస్‌కె బిస్మిల్లాకు చెందిన పాడి గేదె గ్రామ శివారులోని బొల్లం అంజయ్య వ్యవసాయ బావి వద్దకు మేత కోసం వెళ్లింది. గేదె మేత మేసుకుంటూ వెళ్లి బావి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం తీగలను తాకి విద్యుదాఘాతనికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు ఒక లక్షా 20వేలు ఉంటుందని యజమాని ఎస్‌కె బిస్మిల్లా పేర్కొన్నాడు. ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని యజమాని కోరారు.

చంద్ర రాజేశ్వర్‌రావు జీవితం ఆదర్శనీయం


చంద్ర రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

దేవరకొండ : స్వాతంత్య్ర సమరయోధుడు, సీపీఐ నాయకుడు చంద్ర రాజేశ్వర్‌రావు జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వర్‌రావు 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన ఎన్నో పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె నరసింహ, రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, కిన్నెర యాదయ్య, కందుకూరి శ్రీను, నీల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కార్పొరేట్ విద్యకు విద్యార్థుల ఎంపిక

నిడమనూరు: కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా చదువుకునేందుకు నిడమనూరు మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రంజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 లో పదో తరగతి పూర్తి చేసుకున్న నలుగురు విద్యార్థినులు సపావత్ హారిక, మహ్మద్ నస్రీన్‌లు శ్రీచైతన్య హైద్రాబాద్, ఇంద్రవల్లి శృతి, చిత్రం మా నస నల్లగొండలోని గీతాంజలి కళాశాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్యకు మోడల్ స్కూలకు చెందిన నలుగురికి రెండు సంవత్సరాల ఇంటర్ విద్య, ఎంసెట్ లేదా నీట్ కోచింగ్‌తో పాటు ఉచిత హాస్టల్ సౌకర్యం ఉంటుందన్నారు. ఉచిత విద్యా పథకానికి ఎంపికైన నలుగురు విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన చెట్టిపల్లి ముత్తమ్మ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. గురువారం ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద నాగేంద్ర తన పదో తరగతి స్నేహితులతో కలిసి వృద్ధురాలికి రూ.8వేలను ఆర్థికం సాయం తో పాటు రూ.2వేలతో వంట సామగ్రి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మానవతా దృక్పథంతో ఆర్థికసాయం అందజేయడం పట్ల పలువురు ప్రశంసిస్తున్నారు.

బస్టాండ్‌లో సమస్యల తిష్ట

- ఆవరణలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- సక్రమంగా లేని మరుగుదొడ్ల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

డిండి : హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రోడ్డు మార్గ మధ్యలోని డిండి ఆర్టీసీ బస్టాండులో పలు సమస్యలు తిష్ట వేశాయి. దీంతో ఈ బస్టాండు గుండా ప్రతి నిత్యం తమ రాకపోకలు కొనసాగిస్తున్న వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నల్లగొండ జిల్లాకు చెందినప్పటికీ ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ మాత్రం మహబూబ్‌నగర్ రిజియన్ పరిధిలో ఉండటంతోనే సమస్యలు పరిష్కారం కావడం లేదు. బస్టాండు ఆవరణలో కాంప్లెక్స్ షాపులు, రేకుల షాపుల నుంచి అద్దె రూపంలో ప్రతి నెలా ఆదాయం వస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో మాత్రం అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు

సమస్యలతో సతమతం

హైద్రాబాద్, జనగాం, జహీరాబాద్, సంగారెడ్డి, కోదాడ, దేవరకొండ, కల్వకుర్తి, అచ్చంపేట, మిర్యాలగూడ, నల్గొండ, యాదగిరిగుట్ట తదితర డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు ఈ బస్టాండు గుండా రాకపోలు కొనసాగిస్తున్నాయి. బస్టాండు ఆవరణలోని మట్టిరోడ్డు కంకర తేలడంతో బస్సు ప్రయాణ ప్రాంగణంలోకి వచ్చిన సమయంలో బస్సు టైర్ కింద ఉన్న కొన్ని కంకర రాళ్లు ఎగిరి పడి ప్రయాణికులకు గాయలైన ఘటనలూ ఉన్నాయి. అదేవిధంగా మంచినీటి సౌకర్యార్థం ఉంచిన తాగునీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచక పోవడంతో కలుషితమైన నీటిని తాగడంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

బస్టాండు టాయిలెట్స్, మరుగుదొడ్ల పైపులైన్ సరిగ్గా లేక పోవడంతో వాటి నుంచి మురుగు నీరు బయటకు వచ్చి నిల్వ ఉంటుంది. దీనికి తోడు బస్టాండు చుట్టూ పక్కల ఉన్న వ్యాపార దుకాణాలు చెత్తాచెదారం పడేస్తుండటంతో బస్టాండు ఆవరణ డంపింగ్‌యార్డును తలపించేలా మారింది. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోని బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కారమయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.


కంకర తేలిన డిండి బస్టాండ్ ఆవరణ


మురుగునీటిలో స్వైరవిహారం చేస్తున్న పందులు

దుర్వాసనతో ఉండలేకపోతున్నాం



డిండి బస్టాండు ఆవరణలో పారిశుద్ధ్యం పడకేసింది. ఈ మార్గం గుండా ప్రయాణించినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. దుర్వాసనతో బస్టాండ్ వేచి ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సాయికుమార్, ఎర్రారం

దేవరకొండ డిపోకు అప్పజెప్పాలి



బస్టాండులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అచ్చంపేట డిపో అధికారులకు వినతులు అందజేశాం. అయినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. బస్టాండు నిర్వహణ దేవరకొండ డిపోకు అప్పజెప్పాలి.

– మేకల కాశన్న, డిండి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్యం పడకేసిన మాట వాస్తవమే. బస్టాండు ఆవరణలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని ఇప్పటి వరకే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యల పరిష్కరమయ్యే చూస్తాం.

– ప్రసాద్, డీఎం అచ్చంపేట

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ కోరారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆస్పత్రిలో ఆశ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశాలకు నష్టం కలిగించే విధంగా నిర్వహించే పరీక్షను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికై ఈనెల 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమంలో ఆశలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, ఆశాలు కళావతి, జానకమ్మ, శారద, జయమ్మ, ఇందిరమ్మ, ఉమా శ్రీదేవి, అచ్చాలమ్మ, పద్మ, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ప్రతినెలా రెండో తేదీనే పారితోషికం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆశ వర్కర్లతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంటు రామారావు, ఆశ వర్కర్లు పద్మ, కవిత రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


అసోసియేషన్ భవనంలో మొక్కలు నాటుతున్న సభ్యులు

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పట్టణంలోని అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మానవాళి మనుగడకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం బంజారా యూట్యూబ్ ఛానల్‌లో నటీనటులతో పాట చిత్రీకరణను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల వెంకన్న, వేణుగోపాల్, మహేష్, సైదులు, బాలరాజు, తదితరులున్నారు.

జాతీయ స్థాయి ర్యాంక్ సాధించడం అభినందనీయం


సిరివెన్న సాయిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తదితరులు

మిర్యాలగూడ : నీట్ ఫలితాల్లో గిరిజన కేటగిరిలో భూక్యా సిరివెన్నెల సాయి 18వ ర్యాంక్ సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఇంటికి వెళ్లి సిరివెన్నెల సాయిని, తల్లిదండ్రులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని కష్టపడి చదివి నీట్‌లో ర్యాంక్ సాధించి మిర్యాలగూడకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం హర్షణీయమన్నారు. సిరివెన్నెల సాయి ఉన్నత విద్యను అభ్యసించి మంచి డాక్టర్‌గా స్థిరపడి పేద ప్రజలకు సేవ చేయాలని కోరారు. అనంతరం విద్యార్థినికి స్టెతస్కోప్ బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంగం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్, మక్లానాయక్, శంకర్ నాయక్ వెంకన్న, నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు నాగునాయక్, సిద్దునాయక్, అశోక్‌నాయక్, మధునాయక్, హరినాయక్, మంగ్లానాయక్, శ్రీనునాయక్, వెంకన్న, సైదానాయక్, కృష్ణకాంత్, చీనానాయక్, చిన వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి


ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న డీఎం

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు ఎక్కి బహుమతి పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జీవీ మాల్ సౌజన్యంతో 'ఆర్టీసీ బస్సెక్కండి–బహుమతి పొందండి' అనే కార్యక్రమంలో భాగంగా లక్కీ డ్రా తీశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నుంచి విజయవాడకు వెళ్లే రూట్లలో తమ డీలక్స్ సర్వీసులకు ఆదాయం పెంపు, టార్గెట్ సాధించేందుకు మహిళలను ఆకుట్టుకునే విధంగా ఈ కర్యాక్రమాన్ని జీవీ మాల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కీంను ప్రారంభించనప్పటి నుంచి డీలక్స్ బస్సుకు మంచి స్పందన వస్తుందన్నారు. ఈ డ్రాలో ప్రథమ బహుమతి చిలుకూరు మండల బేతవోలు గ్రామానికి చెందిన భద్రమ్మ, ద్వితీయ బహుమతి నందిగామకు చెందిన పోలి శారద, తృతీయ బహుమతి దామరచర్ల మండల కేంద్రంకు చెందిన లాస్యలు గెలుచుకున్నారన్నారు. ఆర్టీసీ సంస్థను అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రయాణీకులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ పుష్పాల యాదగిరి, జీవీ మహాల్ ప్రతినిధులు హరి, సంపత్, సాయి, ఆర్టీసీ సిబ్బంది ఎక్బాల్, పరంగి నాగేశ్వర్‌రావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో వాసవి, వనతి క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆ క్లబ్‌ల డిస్ట్రిక్ పీఆర్‌ఓ రాయపూడి భవాని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ వీరవెల్లి పద్మావతి, జోన్ చైర్మన్ రమాదేవి, డిస్ట్రిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తిరునగరు పద్మావతి, భువనగిరి లావణ్య, కొండూరు ఇందిరా, గుండా లక్ష్మి, వీరవెల్లి శ్రీదేవి, జైయిని సుశ్మీత, జైనీ పద్మావతి, ఓరుగంటి జ్యోతి, మంచుకంటి శ్రీదేవి, రేపాల శ్రీనివాస్, జనార్ధన్, మారం పద్మశ్రీనివాస్, శివ నాగజ్యోతి, శరత్ పాల్గొన్నారు.

పెద్దవూరలో భారీ వర్షం

పెద్దవూర : మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రెండేళ్ల కాలంలో ఇదే భారీ వర్షం అని మండల రైతులు పేర్కొంటున్నారు. ఇన్నాళ్లు వర్షాలు లేక ఎండిపోయిన చెరువులు, వాగులు అలుగులు పోస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడటంతో పాటు వానాకాలం సీజన్‌లో విత్తనాలు వేయడానికి తగిన కార్తెలు రావడంతో రైతులు సిద్ధం అవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


పెద్దవూర: పులిచర్లలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు


హాలియా : చింతగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : అపార అనుభవం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని బకల్‌వాడీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19వ వరకు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అంజమ్మ, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, నాగరాణి, అనిల్‌కుమార్, పద్మజ, పద్మావతి, సైదులు, భగవాన్, మధుసూదన్, రహీం, వెంకటేశం, ప్రభాకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని చింతగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి, హాలియా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూరుగు రామమూర్తి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని చింతగూడెం ఉన్నత పాఠశాల, హాలియా ప్రాథమిక నిర్వహించిన వేరువేరు బడిబాట కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతగూడెం పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, ఎండీ పాషా, పురం వెంకటయ్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, దూసరి మధు, ఈగల లింగయ్య, హాలియా ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు, గ్రేస్ రమోల, దివ్యలక్ష్మి, ఆర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే చేర్పించాలి

నాగార్జునసాగర్ : బడిఈడు పిల్లలందరు పాఠశాలలో చేరాలని నినాదాలు చేస్తూ నందికొండ మున్సిపాలిటీలోని ఆయా పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులంతా వీధుల్లో గురువారం ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైలాన్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శేషు, యూపీఎస్ హెచ్‌ఎం రామంజమ్మ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, రాజయ్య, నిర్మల, రాజబాబు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు ప్రజలు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా కస్తూరిబా గాంధీ విద్యార్థులు కూడా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమ లింగం, అంజిరెడ్డి, శ్రీను, సురేష్‌కుమార్, సహదేవ్, విజయలక్ష్మి, సైది తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సముద్రాల శ్రీనయ్య, కొర్ర లోక్యనాయక్, సూర్యనాయక్, చంద్రయ్య,సీతారాం, ఎబినైజర్, పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాపోలు పరమేష్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లోని వీధులల్లో తిరుగుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు, విద్యార్థులకు కల్పిన సౌకర్యాలను గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మురుగోటి జ్యోతి, పాపని బాలకృష్ణ, విజయలక్ష్మీ, లింగమ్మ, వీరయ్య, అమ్మాఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని పులచర్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. అనంతరం బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మద్దిమడుగు సుష్మా, గ్రామస్తులు బుడిగపాక లక్ష్మయ్య, కంభంపాటి కృష్ణ, సత్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.


తిరుమలగిరి : అల్వాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు


కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు


నాగార్జునసాగర్ : నందికొండలో..

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి


పెద్దవూర : చలకుర్తిలో చిన్నారుల బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ పద్మావతి

పెద్దవూర : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. గురువారం ఆమె మండలంలోని చలకుర్తి–2 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువులను పరిశీలించి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు ఒక్కపూట సంపూర్ణ భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం, శిశువులను విక్రయించటం చట్టరీత్యా నేరమన్నారు. బాలామృతాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌసియాబేగం, అంగన్‌వాడీ టీచర్ శాంత, ఆయా పద్మ పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి


బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మర్ల చంద్రా రెడ్డి

త్రిపురారం : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మర్ల చంద్రా రెడ్డి అన్నారు. మండలంలోని అంజనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాల్తీ తండాలో జవహర్ యువసేన ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం కాంగ్రెస్ జిల్లా నాయకులు మర్ల చంద్రా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీల్లో గెలుపొందిన టీంలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శకుంతలమ్మ, వెంకయ్య, కొడావత్ గోపాల్, మడుపు కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న జానారెడ్డి

త్రిపురారం : మండలంలోని కొణతాపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మండల నాయకులతో కలిసి కొణతాల పల్లిలో ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రా రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, శ్రీనివాస్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ధ్వంసమైన కోళ్ల ఫారం షెడ్డు పరిశీలన

త్రిపురారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గా నగర్‌లో రైతు వీరమళ్ల జ్యోతికి చెందిన రెండు కోళ్ల షెడ్లు ఇటీవల కొద్ది రోజుల కిందట వచ్చిన గాలి వానకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రూ. 50 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మండల కాంగ్రెస్ నాయకులతో సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి దుగ్గెపల్లిలో ధ్వంసమైన కోళ్ల షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నేళ్ల నుంచి కోళ్ల పెంపకం చేపడుతున్నారు. ఎంత ఆస్తి నష్టం జరిగిందని బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని పూర్తి స్థాయిలో అరికట్టాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన ఆ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికార యంత్రాంగం నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. పట్టణంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చల విడిగా ఎల్‌కెజీ విద్యార్థికి 45 వేల నుంచి 70 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, కోటేష్, లోకేష్, నవీన్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కార్లు

మిర్యాలగూడ అర్బన్: రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై గురువారం ఉదయం జరిగింది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోట్ల రామారావు తన తమ్ముడు ప్రసాద్‌తో కలిసి వారి సొంతూరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గురజాలకు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో మిర్యాలగూడ మండలం ములకలాల్వ గ్రామానికి చెందిన పాదిల్ల వేణు కారులో హైదరాబాద్ వైపు వెళ్తుండగా.. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి ఫ్లెవ్లర్‌పై అతడి కారు అదుపుతప్పి డివైడర్ మీదుగా అవుతలి వైపు వెళ్లి అటుగా వస్తున్న రామారావు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ వెన్నుపూస విరిగిపోగా.. రామారావుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. రెండు కార్లు ముందుభాగం ధ్వంసమయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.